వచ్చినప్పుడు మనకు ఉపయోగపడాలి. మనకు ఏదైనా కష్టకాలం వస్తే గురువే రక్షించాలి, భగవంతుడే రక్షించాలి. మనలను గొప్పవారు అని చెప్పేవారంతా మనకు కష్టం వచ్చినప్పుడు వదిలేసి వెళ్ళిపోతారు కాని మనలను విడిచిపెట్టకుండా ఉండేవాడు మన గురువు మాత్రమే అంటే ఒకరిని విమర్శించటం కాదు, లోకం పోకడ అటువంటిది. నీకు వందకోట్ల డబ్బు ఉంటే అందరూ స్నేహితులే, అందరూ చుట్టాలే. ఏదో కారణం వలన వందకోట్లు పోయింది అనుకో మీకు ఎవరు చుట్టం కనబడడు, స్నేహితుడు కనబడడు. మీరు లోకానికి ఏదైనా మంచిచేస్తే అది భగవంతుడికి నివేదనగా, నైవేద్యంగా చేయండి అంతేగాని దానివలన గర్వం తెచ్చుకొంటే మూలంలో కుళ్ళిపోతారు. మీరుచేసేపని వివేకవంతంగా ఉండాలి, మీరుచేసే మంచిపని ఇహపరాలకు బ్రిడ్జిగా ఉండాలి. మీరు కర్మచేస్తూ ఉంటే సరిపోదు కర్తలేని కర్మ చేయండి అన్నారు భగవాన్. కర్తలేని కర్మ చేస్తూ ఉంటే కర్మ కూడా అకర్మ అయిపోతుంది, అప్పుడు నీవు చేసిన చేయనివాడితో సమానము. మీరు అహంకారంతో మంచిపని చేస్తే అది పుణ్యంగా వచ్చి మిమ్మల్ని బంధిస్తుంది, అది సంసారం కాదు అనుకొంటున్నారేమో అది కూడా సంసారమే. మిమ్మల్ని బంధించేది ప్రతీదీ సంసారమే. కర్తృత్వం లేకుండా మీరు కర్మచేస్తూ ఉంటే అది మిమ్మల్ని బంధించదు. ఇతరులకు ఏదైనా చేసేటప్పుడు వారి హృదయంలో ఉన్న భగవంతుడిని చూడండి. అప్పుడు అది పని అవ్వదు, పూజ అవుతుంది, అది మిమ్మల్ని బంధించదు, అది ఆత్మజ్ఞానానికి దారి చూపిస్తుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-08-05, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈరోజు పంచముఖి ఆంజనేయస్వామివారి ప్రాంగణంలో మనం సభ ఏర్పాటు చేసుకొన్నాము. ఆంజనేయస్వామి సేవాతత్పరుడు. నేను, నాది ఈ రెండూ లేనివాడు, పరిపూర్ణమైన జ్ఞానంకలవాడు. ఈ గోడ ప్రక్కన ఏమి ఉందో మనకు తెలియదు, రేపు ఏమి జరుగుతుందో మనకు తెలియదు, రాబోయే జన్మలో మనం ఎక్కడకు వెళతామో మనకు తెలియదు, మనందరము జీవులము. కాని 100 సంవత్సరాల తరువాత కూడా ఫలానా రోజున ఫలానా గంటలో ఏమి జరుగుతుందో తెలిసినవాడు పరమాత్మ, భూతభవిష్యత్ కాలాల గురించి పూర్తిగా ఆయనకు తెలుసు. మనం తెలివి తక్కువవారము లేకపోతే కొంచం తెలిసినవారము, ఆ కొంచం తెలిస్తేనే మనకు గర్వం వచ్చేస్తోంది, పొగరుబోతుతనం వచ్చేస్తోంది. పరమాత్మకు అన్నీ తెలుసు కాబట్టి ఆయన అణిగి ఉన్నాడు, మనకు ఏమీ తెలియదు కాబట్టి ఎగిరి ఎగిరి పడుతున్నాము. మనకు రామచంద్ర ప్రభువు యొక్క అనుగ్రహం ఉంటే, ఆంజనేయస్వామి యొక్క అనుగ్రహం ఉంటే మన బుద్ధిలో ఉన్న దోషములు అన్నీ భూషణములుగా

మారిపోతాయి అని తులసీదాసు అన్నాడు. ఒక రామభక్తుడికి కళ్ళు సరిగా కనబడేవి కావు. నాకు కళ్ళు సరిగా కనబడటం లేదు కళ్ళు ఇవ్వు రామా అని ఆ భక్తుడు అడగటం లేదు. కళ్ళకు గుడ్డితనం రావచ్చు, కాళ్ళకు కుంటితనం రావచ్చు, నోటికి మూగతనం రావచ్చు, ఈ శరీరం నేను కాదు, ఈ మనస్సు నేను కాదు, ఈ అవయవాలు నేను కాదు. మనకు కళ్ళు కనిపిస్తూ ఉన్నా 1000 సంవత్సరాలు జీవించము కదా. కళ్ళకు గుడ్డితనం ఉంది కాని లోపల ఉన్న చైతన్యానికి గుడ్డితనం లేదు. శరీరం పుడుతుంది, పెరుగుతుంది, మరణిస్తుంది, అది శరీరానికి సంబంధించిన ధర్మాలు. మనస్సు ఒకోసారి శాంతిగా ఉంటుంది, ఒకోసారి అశాంతిగా ఉంటుంది, ఉద్రేకాలు వస్తూ ఉంటాయి, ఇవన్నీ మనస్సులోని రోగాలు, మనస్సుకు అనేక వికారాలు రావచ్చు. కాని చైతన్యంలో ఇవి ఏమీ లేవు. అటువంటి చైతన్యం అంతటా ఉంది. అది నా హృదయంలో ఉంది. ఆ చైతన్యం తాలుక ఎరుక నాకు అనుగ్రహించు రామా అంతేగాని నా కళ్ళకు చూపు ఇమ్మని నేను అడగటం లేదు అంటున్నాడు ఆ రామభక్తుడు. నా శరీరానికి సంబంధించిన ఎరుక, నా మనస్సుకు సంబంధించిన ఎరుక ఇప్పుడు నాకు ఎలాగ ఉందో, అలాగ నా హృదయంలో ఉన్న మరణం లేని వస్తువు యొక్క ఎరుక నాకు కలిగించు రామా, నాకు జ్ఞానాన్ని ప్రసాదించమని అడుగుతున్నాను కాని నా గుడ్డితనం పోగొట్టమని అడగటంలేదు రామా అంటున్నాడు ఆ భక్తుడు.

భగవంతుని యొక్క అవతారములలో కృష్ణావతారం, రామావతారం రెండూ పూర్ణమైన అవతారములు. రాముడిది ధర్మావతారం, కృష్ణుడిది లీలావతారం. రాముడు నవమిరోజున పునర్వసు నక్షత్రంలో శరీరం ధరించాడు, కృష్ణుడు అష్టమి రోజున రోహిణీ నక్షత్రంలో శరీరం ధరించాడు, వీరిద్దరూ జన్మలేనివారే, జన్మలేనివాడు జన్మ తీసుకొంటాడు అది అవతారం. ఈ లోకంలో అధర్మాన్ని నశింపచేయటానికి, ధర్మాన్ని ఉద్ధరించటానికి అవసరాన్నిబట్టి శరీరాన్ని ధరిస్తాను అని పరమాత్మ గీతలో చెప్పాడు. దేవుడు ఉన్నాడు అని చెపుతున్నారు కదా, దేవుడు ఉంటే కనిపించాలి కదా, కనిపించని వాడిని మనం ఎలా నమ్ముతాము అని ఒక నాస్తికుడు భక్తుడిని అడుగుతున్నాడు. అప్పుడు ఆ భక్తుడు ఏమి చేసాడు అంటే నాస్తికుడి దవడ మీద ఒకటి గట్టిగా కొట్టాడు, ఆ నొప్పి నొప్పి అన్నాడు ఆ నాస్తికుడు. నీ నొప్పి నీకు కనిపిస్తోందా అని ఆ భక్తుడు అడిగాడు, కనిపించటం లేదు, మరి నొప్పి నీకు తెలుస్తోందా అని అడిగాడు, నొప్పి తెలుస్తోంది అని చెప్పాడు. దేవుడు కూడా అంతే అని చెప్పాడు. నీ నొప్పి నీకు ఎంత డైరెక్టుగా అనుభవంలోనికి వస్తోందో, దేవుడిని అనుభవంలోనికి తెచ్చుకున్నవారు కూడా దేవుడిని అలాగే అనుభవిస్తారు. భగవంతుడు రూపరహితుడు, నామరహితుడు. భగవంతుడు శరీరం తీసుకొన్నప్పుడు కూడా తాను

శరీరమాత్రుడిని కాదని ఆయనకు తెలుస్తూ ఉంటుంది. మనకు బ్రహ్మానుభవం కలగకుండా రూపబుద్ధి, నామబుద్ధి అడ్డువస్తున్నాయి. మనకు ఆరోజుకారోజు రూపబుద్ధి, నామబుద్ధి పెరిగిపోతున్నాయి. మనం ఆత్మజ్ఞానం పొందాలంటే నెమ్మదిగా కష్టపడి, కష్టపడి రూపబుద్ధిని, నామబుద్ధిని నశింపచేసుకోవాలి. నేను మీ ఇంటికి ఎలా వస్తున్నానో, మీరు నా ఇంటికి ఎలా వస్తున్నారో అలాగే దేవుడి ఇంటికి వెళ్ళిపోవాలి అని ఒక భక్తుడు అనుకొన్నాడు. ఎలాగైతే కష్టపడి, కష్టపడి దేవుడి ఇల్లు ఎక్కడ ఉందో తెలుసుకొని, దేవుడి ఇంటికి వెళ్ళాడు. తలుపు వేసి ఉంది, ఆ భక్తుడు తలుపు తట్టాడు. లోపల దేవుడు ఉన్నాడు, బయట జీవుడు ఉన్నాడు. ఎవరు వారు అని లోపల నుండి దేవుడు అడిగాడు. భక్తుడు పేరు చెప్పాడు. ఇంకొకసారి ఎవరు వారు అని అడిగాడు. పేరు, కులం ఇవి అన్నీ ఆ భక్తుడు చెపుతున్నాడు. అప్పటానికి వాడు భక్తుడే కాని ఇంకా ముగ్గలేదు. తలుపు తడుతున్నాడు, చెయ్యి నొప్పి పుడుతోంది కాని తలుపు తీయటంలేదు. దేవుడు లేడా? అంటే లోపల ఉన్నాడు. మన మాటలు వింటున్నాడు. దేహమే నేను అనే బుద్ధి వాడికి ఇంకా పోలేదు. మనలో ఏదో పొరపాటు ఉంది, దానిని సవరించుకొని మరల వద్దాము అని ఆ భక్తుడు అనుకొన్నాడు. తిరిగి వెళ్ళిపోయి కొంతకాలం ఆత్మ గురించి శ్రవణం చేసి, మననం చేసి, ఆత్మను ధ్యానం చేసి తనలో ఉన్న పొరపాటును గ్రహించి దానిని సవరించుకున్నాడు, తలుపు కొట్టినా ఎందుకు తీయలేదో తెలుసుకున్నాడు, అతనిలో వివేకం పెరిగింది, బుద్ధిసూక్ష్మత పెరిగింది. అప్పడు వెళ్ళి మరల తలుపు తట్టాడు. ఎవరు వారు? అని మరల దేవుడు లోపల నుండి అన్నాడు. అప్పడు ఈ భక్తుడు నేను అనలేదు, నువ్వే అన్నాడు. ఇక్కడ ఎవరూ లేరు, నీవే ఉన్నావు అన్నాడు. అంటే నేను పోయింది, దేవుడు మిగిలాడు. అప్పడు తలుపు తెరువబడింది, లోపలకు వెళ్ళాడు, దేవుడిలో ఐక్యమయ్యాడు.

మనందరిలోని దోషం ఏమిటి అంటే భగవంతుడు ఎక్కడో ఉన్నాడు అనుకొంటున్నాము. ఆయన అంతటా ఉన్నాడు, మనలోను ఉన్నాడు. మన చుట్టాలకంటే, మన డబ్బుకంటే, మన ఇంద్రియాలకంటే అత్యంత సమీపంలో మన దగ్గర ఉన్నవాడు దేవుడే కాని ఆయన ఎక్కడో దూరాన ఉన్నాడు అని మనం అనుకొంటున్నాము, అదే మాయ. నా మాయను ఎవరూ జయించలేరని భగవంతుడు చెప్పటానికి కారణం అదే. అందరూ దేహ సౌందర్యం చూస్తున్నారు కాని మనస్సులో ఉన్న సౌందర్యం ఎవరికి అక్కరలేదు. దేహసౌందర్యం కంటే మనస్సు యొక్క సౌందర్యం చాలా ముఖ్యం అని మనందరము మర్చిపోతున్నాము. కొంతమందికి దేహసౌందర్యం లేకపోయినా లోపల మనస్సులో గొప్ప సౌందర్యంగా ఉంటారు. దేహసౌందర్యం వేరు, మానసికసౌందర్యం వేరు. భగవంతుడు నీ దేహసౌందర్యాన్ని చూడడు,

మానసికసౌందర్యాన్ని చూస్తాడు. ఆ లోపల సౌందర్యాన్ని, ఆ జిజ్ఞాసను మనం ప్రయత్నం చేసి కలుగజేసుకోవాలి. మనం ఏ రంగంలో అభివృద్ధిలోనికి రావాలనుకొంటున్నామో వారితో సహవాసం చేయాలి కాని ఇతరులతో స్నేహం చేయకూడదు. మనం ఆత్మజ్ఞానం సంపాదించుకోవాలి అనుకొంటున్నాము అనుకోండి, ఆత్మజ్ఞానసముపార్జనలో ఎవరు ప్రయత్నంలో ఉన్నారో, ఎవరు బాగా సాధన చేసుకొంటున్నారో వారితో స్నేహం చేయాలి కాని ఇతరులతో స్నేహం తగ్గించుకోవాలి అంటే ముముక్షువులతో సహవాసం చెయ్యాలి.

ఉపనిషత్‌లలో ఇంద్రియ నిగ్రహం గురించి, మనో నిగ్రహం గురించి విశేషంగా చెప్పబడింది. నువ్వు ఆరోజుకారోజు నిగ్రహం పెంచుకోవాలి కాని ఆగ్రహం పెంచుకోకూడదు. జీవకోటి పట్ల సాధ్యమైనంత వరకు దయగా ఉండు, క్రూరత్వం పనికిరాదు. నువ్వు చేసేపనిని భగవంతుడు చూడడు, ఆ పనిచేసేటప్పుడు నీ సంకల్పాన్ని చూస్తాడు, దానినిబట్టి నీకు మార్కులు వేస్తాడు. మనకు నిగ్రహం లేకపోతే ఎటువంటి ప్రమాదాలు వస్తాయో ఈ కథ చెపుతుంది. పరీక్షిత్తు మహారాజు ఒకసారి వేటకు వెళ్ళాడు, అక్కడ ఆయనకు విపరీతమైన దాహం వేసింది. అంగిరీసుడు అనే మహర్షి ఒకచోట తపస్సు చేసుకొంటున్నాడు. ఆ రాజు అంగిరీసుడిని మంచినీళ్ళు ఎక్కడ దొరుకుతాయి అని అడిగాడు. ఆ మహర్షి మనలో లేడు, ధ్యానంలో ఉన్నాడు కాని ఆ విషయం రాజుకు అర్థం కావటంలేదు. జ్ఞాని, అజ్ఞాని ప్రక్కప్రక్కనే కూర్చొంటారు, వారి శరీరాలు అక్కడే ఉంటాయి కాని లోపలకు వెళ్ళి చూస్తే ఒకరికి ఒకరికి పోలికలు ఉండవు. జ్ఞాని ఎక్కడో ఉంటాడు, అజ్ఞాని ఈ మట్టిలో పడి ఏడుస్తూ చావటానికి సిద్ధంగా ఉంటాడు, చావును జయించినవాడు జ్ఞాని. పరీక్షిత్తు మహారాజు ఇక్కడే ఉన్నాడు కాని అంగిరీసుడు ఎక్కడో ఉన్నాడు, అసలు ఈ దృష్టిలో లేడు. మంచినీళ్ళు గురించి అడిగితే చెప్పలేదని రాజుకు కోపం వచ్చింది. ఆ ప్రక్కనే పాము కుబుసం ఉంటే దానిని తీసి ఆ ఋషి మెడలో వేసి వెళ్ళిపోయాడు. తరువాత అంగిరీసుడి కుమారుడు అక్కడకు వచ్చాడు. పాము విడిచిపెట్టిన చర్మాన్ని మా తండ్రి మెడలో వేస్తాడా? మా తండ్రిని ఇంత అగౌరవ పరచినవాడు ఎవడు? వాడు ఎవడైనా సరే వారం రోజులలో చనిపోవుగాక అని శపించాడు. కొడుకు కేకలకు మహర్షి కొంచెం కళ్ళు తెరిచాడు. ఏమిటి బాబు? అని అడిగాడు. అక్కడకు వచ్చినవారు మహర్షితో ఏమి చెప్పారు అంటే మీ దగ్గరకు వచ్చినవాడు పరీక్షిత్తు మహారాజు, మీ అబ్బాయి వాడిని వారం రోజులలో చనిపోవాలని శపించాడు అని చెప్పాడు. ఈ కథ కాలక్షేపం కోసం చెప్పటం లేదు, ఇక్కడ మీరు బాగా అర్థం చేసుకోండి. అంగిరీసుడు కొడుకును పిలిచి వాడు ఏదో పొరపాటు చేసాడు, అంతకంటే పెద్ద పొరపాటు నీవు చేసావు. పరీక్షిత్తు చేసింది పొరపాటే కాని మనం ఏమి

చేయాలి అంటే నీవు ఇలా ప్రవర్తించకూడదు, నిగ్రహం కోల్పోయావు అని వాడికి బోధించి వాడిని సరిచేయాలి. కాని నీవు పరీక్షిత్తును వారం రోజులలో చనిపోవాలని శపించావు, నీ మాట జరిగితీరుతుంది, ఆపటం నావల్ల కూడా కాదు. వారం రోజులలో చనిపోతాడని పరీక్షిత్తుకు తెలియదు అందుచేత నీవు వారం రోజులలో చనిపోతావని పరీక్షిత్తుకు కబురు పంపు, వాడు రాజ్యానికి అధికారి. వారం రోజులలో అంతా చక్కపెట్టుకొని దేవుడిని స్మరించుకొంటాడు. అయిపోయినది ఏదో అయిపోయింది, ఇప్పుడు అయినా వాడిని బాగుచేద్దాము అని కొడుకుతో చెప్పాడు. ఆయన ఎంత మంచివాడో, ఎంత గొప్పవాడో చూడండి. వాడికి కోపం అంటే వాడికంటే ఎక్కువ వీడికి కోపం, వాడు అసూయపడుతున్నాడు అంటే వాడికంటే ఎక్కువ వీడు అసూయ పడటం, అంటే తోటి మానవుడి క్షేమం కోరటం తగ్గిపోయింది. ఇక్కడ నుండి కలియుగం ప్రారంభమయింది.

భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. వాడు దయాస్వరూపుడు, అనుగ్రహ స్వరూపుడు అని గుర్తింపు కూడా మనకు లేదు. అవతారపురుషులకు సొంతప్రారబ్ధం ఉండదు. మంచివారి పుణ్యప్రారబ్ధం, చెడ్డవారి పాప ప్రారబ్ధం కలిపి ఆ శరీరానికి ప్రారబ్ధం వస్తుంది అని చెప్పారు. మంచి వారిని రక్షించటానికి, చెడ్డవారిని శిక్షించటానికే ఆ శరీరం వస్తుంది. వాడు శరీరం ధరించినప్పుడు కూడా ఆ శరీరం తాను కాదని వాడికి తెలుస్తూ ఉంటుంది. మనందరం పుట్టాము అనుకొంటాము, భగవంతుడు జన్మ తీసుకొన్నా తాను జన్మరహితుడనని వాడికి తెలుస్తూ ఉంటుంది. దేవుడికి, జీవుడికి ఉన్న తేడా అదే. ఏ విషయంలోను అతి పనికిరాదు. సాధన అభివృద్ధి పొందాలంటే తగుమాత్రంగా ఉండాలి. ఆహారవిషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మీ పని ఏదో మీరు చేసుకోవాలి అంతేగాని రోడ్డుమీద కనిపించిన పనులు అన్నీ నెత్తిల్లకోకూడదు. ఇప్పుడు రోజులు ఎలా ఉన్నాయి అంటే మంచి చేయటానికి వెళితే చెడ్డ ఎదురువస్తోంది, ఉపకారం చేయటానికి వెళితే అపకారం ఎదురువస్తోంది, కలియుగ ప్రభావం అది. ప్రపంచానికి సేవచేయాలని ఉంది అని ఒకరు భగవాన్‌తో అంటే అసలు ప్రపంచం ఉందో, లేదో తెలుసుకో ఉంటే సేవ చేద్దువుకాని లేకపోతే లేదు అన్నారు. మనస్సు అనేది ఉందో లేదో ముందు తెలుసుకో, మనస్సు లేకపోతే నిగ్రహంతో పనిలేదు, మనస్సు ఉంది అనుకొంటే అప్పుడు దానిని నిగ్రహించు. మనం సేవ చేసినా, నేను ఎవడను అనే విచారణ చేసినా, నిష్కామకర్మ చేసినా అహంభావ రహిత స్థితిని పొందటానికే ఇవి అన్నీ చేస్తున్నాము అని మర్చిపోవద్దు. మనం ఏది సాధించిన భగవంతుని అనుగ్రహం వలననే సాధ్యమవుతుంది కాని మన తెలివితేటల వలన కాదు. మన తెలివితేటలవలన అవుతోంది అని అనుకోవటం వలన మనం అజ్ఞానంలో

కూరుకొనిపోతున్నాము.

నాకు ఎక్కువ కష్టాలు వస్తున్నాయి అని ఒకరు భగవాన్‌తో అంటున్నారు. నీకు వచ్చే కష్టాలు భగవంతుడికి తెలుసుండి వస్తున్నాయా లేక ఆయనకు తెలియకుండా వస్తున్నాయా అని భగవాన్ అడిగారు. ఆయనకు తెలిసే వస్తున్నాయి అని చెప్పాడు. ఆయనకు తెలిసే వాటిని నీకు పంపుతున్నాడు కదా, ఆ కష్టాల ద్వారా నీకు పాఠాలు నేర్పటానికే వాటిని భగవంతుడు పంపుతున్నాడు, ఆ కష్టాలకు అతీతంగా నీవు ఉండాలి. చెరువులోనికి దిగినప్పడు నీరు మోకాలి లోతువరకు వస్తే ఆ చెరువులోని నీరు మనలను చంపదు. నీ కష్టాలు కూడా నీవు మోకాలి లోతులో ఉన్నట్లే ఉండాలి, అవి నిన్ను ముంచేయకూడదు, వాటికి అతీతంగా నీవు ఉండాలి. పరిష్కార మార్గం చూసుకోవచ్చు కాని అందులో నీవు మునిగిపోకూడదు. ఆ సమస్యలకు పైన ఉండి వాటిని పరిష్కరించుకో. ఆ కష్టాలు నీకు పాఠాలు నేర్పటానికే వస్తున్నాయి, భగవంతుడికి తెలియకుండా అవి రావటం లేదు అన్న విషయం నీవు గుర్తించాలి. బడిలోనికి వెళ్లి పిల్లలు పాఠాలు ఎలా నేర్చుకొంటారో అలాగ ప్రపంచంలో జరిగే సంఘటనల నుండి మనం పాఠాలు నేర్చుకోవాలి. ఈ శరీరం ఏ ట్రైనింగ్ పొందటానికి భూమి మీదకు వచ్చిందో అది అయిపోయిన వెంటనే ఈ శరీరంలోని ప్రాణం తీసేస్తాడు. ఆహారం, నిద్ర, వ్యాపకాలు అన్నీ కూడా తగుమాత్రంగా ఉండాలి, అన్నీ నిగ్రహంలో ఉండాలి. ఏదో సాధన చేద్దాము అనుకొంటే కొంతమందికి నిద్ర వచ్చేస్తుంది, కొంతమందికి మనస్సు ఎక్కడికో పోతుంది. ఇవి రెండూ అవరోధాలు. శరీరానికి తిండి తగుమాత్రంగా పెట్టాలి, మనస్సుకు ఏకాగ్రత నేర్పాలి. అప్పుడు ఈ రెండు అవరోధాలు పోతాయి. శరీరానికి ఆరోగ్యం ఎంత అవసరమో మనస్సుకు ఏకాగ్రత అంత అవసరం.

జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవద్దు. జరిగిపోయిన గొడవలను గొయ్యితీసి పాతరవెయ్యి. రాబోయే గొడవలను ఊహించుకోవద్దు. ఎప్పుడు ఏది ఎలా జరగాలో అలా జరుగుతుంది. వాటిని ఊహించుకొని నీ మనస్సును పుండు చేసుకోవద్దు. వర్తమానకాలంలో జీవించు, నీ చేతిలో ఉన్న క్షణాన్ని ఉపయోగించుకో, ముక్కులో గాలి తిరుగుతున్నంత కాలం మనం జీవించ వలసిందే. జిన్నూరు విడిచిపెట్టి కాశీ పారిపోగలవు కాని జీవితాన్ని విడిచి ఎక్కడికి పారిపోతావు. పారిపోవటానికి ప్రయత్నం చేయవద్దు. నీ సమస్యలకు అతీతంగా ఉండి వాటిని పరిష్కారం చేసుకోవటానికి ప్రయత్నించు, అప్పుడు దేవుని అనుగ్రహం నీకు తోడవుతుంది. అందుచేత వర్తమానకాలంలో జీవించు. నీకు తలకాయ ఉంది కాబట్టి దానితో ఆలోచించు, నీకు చేతులు ఉన్నాయి కాబట్టి వాటితో పని చేస్తూ ఉంటే నీవు భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను అభివృద్ధిలోనికి వస్తావు. సోమరితనం పనికిరాదు. మీకు

తాత్కాలికంగా దుఃఖం, అశాంతి, సంతోషం వచ్చినా వాటితో తాదాత్మ్యం పొందకండి. మీకు వచ్చిన కష్టాలు గాని, దుఃఖంగాని, సంతోషంగాని నిజంకాదు కాబట్టి వాటితో కలవకండి. పదండి ముందుకు, పదండి ముందుకు, హృదయం యొక్క లోతుల లోనికి మనం ప్రవేశించాలి. ఈ సంతోషాలు, దుఃఖాలు మీరు కాదు. మీరుకాని దానితో కలిస్తే మరల దానినుండి విడిపోవటానికి జన్మలతరబడి సాధన చేయాలి, ఇది రమణ బోధ.

వ్యక్తిభావన నశించకుండా మోక్షసామ్రాజ్యానికి అధిపతి అవ్వలేము. మనకు ఏదైనా మంత్రి పదవి వచ్చింది అనుకోండి, అది ఉన్నంతసేపు అదే నిజం అనుకొంటాము. రేపు అది ఊడిపోతుందని మనకు తెలియటం లేదు. కరెంటులేని ఇల్లుగాని, నీరులేని ఇల్లుకాని లేకుండా చేస్తాము అని ఏవో మాటలు నాయకులు చెపుతూ ఉంటారు. అలా చెప్పటంలో వారి పొరపాటు లేదు. దానిలో ఎంత నిజం ఉందని మనం వివేకంతో జీవించాలి. వైరాగ్యం విడిచిపెట్టకుండా, వివేకం విడిచిపెట్టకుండా జీవిస్తూ ఉంటే మనం సేఫ్‌గా గమ్యానికి వెళతాము. మనకు పెద్ద తెలివితేటలు అక్కరలేదు, ఇతరులు చేసే మాయలో పడకుండా ఉండే తెలివితేటలు ఉంటే సరిపోతుంది. మన హృదయంలో ఉన్న సత్యవస్తువు మనకు ఎరుకలోనికి రాకుండా మన మనస్సే మనకు అడ్డువస్తోంది. అందువలన మనస్సును పెంచుకోకుండా, దానిని ఎంతవరకు తగ్గించుకోగలిగితే అంతవరకు తగ్గించుకోవాలి. నీ హృదయంలో ఉన్న నిజంతో నీవు ఏకమయ్యే వరకు నీ ప్రయాణం ఆపుచేయవద్దు, ఈలోపు నీకు ఎదురయ్యే వాటిని ఇది నేను కాదు, ఇది నేను కాదు అని వాటిని గెంటుకుంటూ అక్కడ ఆగకుండా నీ ప్రయాణం సాగించాలి, మనం కానిదానిలోనుండి ఈనాటికైనా, ముందు నాటికైనా మనం విడిపోవలసిందే. మనం నేర్చుకొన్నది అంతా మర్చిపోవలసిందే. నేర్చుకొన్నది బుద్ధి అది మనం కాదు. చలించేది మనస్సు అది మనం కాదు, చనిపోయేది శరీరం అది మనం కాదు. నీవు కానిదానిలో నుండి వేరుపడటం నేర్చుకో. నువ్వు సుఖ పడతావు. పూర్వానికి, ఇప్పటికి తేడా ఏమిటి అంటే మనిషిలో సహనం తగ్గిపోయింది, మానవుడి మానసం అభివృద్ధి అవ్వలేదు, మనషికి లోచూపు రావాలి. ఎన్ని అవరోధాలు, ఆటంకాలు వచ్చినా రానివ్వండి. మనం ప్రయాణం చేసేటప్పుడు అనేకం ఎదురువస్తాయి. ప్రక్కకు తప్పుకొని వెళ్ళిపోతాము గాని అక్కడ ఆగిపోము. అలాగే మీకు ఎదురయ్యే ఆటంకాలను తప్పించుకొని వెళ్ళిపోతే మీ గూట్లో మీరు పడిపోతారు, మీరు ఎక్కడి నుండి వచ్చారో అక్కడికి చేరుకొంటారు.

నేను చాలా సంవత్సరాల నుండి సాధన చేస్తున్నాను, అభివృద్ధి కనబడటం లేదు అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. సాధనచేసిన సక్సెస్ అవ్వకపోవటానికి వైరాగ్యం లేకపోవటం కారణం. మన మనస్సు చలిస్తూ ఉంటే ఏదో కోరిక ఉందని అర్థం. కోరిక ఉ

ంది అనుకోండి దానిని నిగ్రహించుకోవటానికి అభ్యాసం చేయాలి. పని నిన్ను బంధించదు, ఫలకాంక్ష నిన్ను బంధిస్తుంది, నేను చేస్తున్నాను, ఇది నావలననే అవుతోంది అనే కర్తృత్వభావన బంధిస్తుంది. భగవంతుడికంటే ఎక్కువగా మనలను ప్రేమించేవాడు ఎవడూ లేడు. మన జీవితానికి ఎవడైతే గైడ్‌గా ఉన్నాడో, ఎవడైతే వెలుగును ఇస్తున్నాడో వాడు లేడు అనుకొంటున్నాము. కుండను చూస్తూ మట్టి లేదు అనుకోవటం ఎటువంటిదో ఈ లోకాన్ని చూస్తూ భగవంతుడు లేడు అనుకోవటం కూడా అటువంటిదే. భగవంతుడి కంటే ఎక్కువగా మన క్షేమం ఎవరైనా కోరుతున్నారు అని అనుకొంటే మనకు భగవంతుడి గురించి సరియైన అవగాహన లేదు అని అర్థం. భగవంతుడు తన శరీరం కంటే భక్తుడి శరీరాన్ని ఎక్కువగా చూసుకొంటాడు. పరమాత్మ శరీరంలో ప్రవేశించాక జీవాత్మ అవుతాడు. ఈ శరీరం నాది, ఈ శరీరం నాది అని జీవుడు అనుకొంటాడు. ఆ బుద్ధిని పోగొట్టుకొంటే వాడు దేవుడు అయిపోతాడు. అందుచేతనే జీవుడికి చేసే సేవ దేవుడికి చేసినట్లే అని మన పెద్దలు చెపుతారు. జీవలక్షణాలు దేవుడు కాదు కాని జీవుడు కూడా దేవుడే. మనం శరీరం విడిచిపెట్టినప్పుడు అందరూ విడిచిపెట్టేస్తారు కాని భగవంతుడు మనలను విడిచి పెట్టడు. అంతటా వ్యాపించి ఉన్నవాడు, మనలో అంతర్యామిగా ఉన్నవాడు భగవంతుడే. ఇంక ఆయనను విడిచిపెట్టి ఎక్కడికి పారిపోతాము. ఒకవేళ పారిపోయినా ఇల్లు, ఊరు దూరం అవుతుందికాని దేవుడు మనకు దూరం అవ్వడు. ప్రతీ క్షణాన్ని సద్వినియోగం చేసుకొంటున్నామా అని చూసుకోండి. భవిష్యత్ గురించి గాలిలో మేడలు కట్టవద్దు. జరిగి పోయిన గొడవలు తలపెట్టుకోవద్దు, వర్తమాన కాలాన్ని ఉపయోగించుకోండి. ఇదే సాధన యొక్క రహస్యం. సబ్బు రాసుకొంటూ ఉంటే అరిగిపోతుంది, చివరకు వచ్చిన తరువాత బయట పడవేస్తాము. ఈ లోకంలో ఉన్న భోగాలు నిజం అని వాటికి అలవాటు పడితే మనం లోపల సబ్బు అరిగిపోయినట్లుగా అరిగిపోతాము, ఈలోపు శరీరానికి చావు వచ్చేస్తుంది, జీవితంలో ఏమి సాధించాము అంటే ఏమీ కనబడదు.

ఆత్మాభిముఖంగా ప్రయాణం చేయటం, నీ హృదయంలో ఉన్న వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటం అది అర్థమయితే తేలికగా ఉంటుంది, అర్థంకాకపోతే చాలా కష్టం. మనం ఇంతవరకు మోక్ష సుఖం రుచి చూడలేదు. రుచి చూస్తే దానిని పొందటానికి నిరంతరం ప్రయత్నం చేస్తాము, అటు ఇటు చూడము, అదే ప్రయాణంలో ఉంటాము అట్టిది ఆ సుఖం. మనం స్వార్థంతో పనిచేసినప్పుడు ఏదో ఫలితం వస్తుంది, ఆ ఫలితాన్ని అనుభవిస్తాము అప్పుడు సంస్కారం పడుతుంది. ఆ సంస్కారంలో నుండి వాసన వస్తుంది, ఆ వాసనలో నుండి కోరిక వస్తుంది. మన శరీరం చనిపోయినప్పుడు కూడా ఈ వాసనలు, సంస్కారాలు

ఆధ్యాత్మికహృదయంలో ఉండిపోతాయి. మరల కొత్తశరీరం వచ్చిన తరువాత ఒకో వాసన, ఒకో వాసన పని చేయటం మొదలుపెడుతుంది. నీలో ఉన్న వాసన తలంపు రూపంలో వస్తేనేగాని అది ఉన్నట్లుగా నీకు తెలియదు. నీలో ఉన్న వాసన తలంపు రూపంలో రాకుండా హృదయంలో ఉన్న దేవుడికి తెలుస్తుంది. మనకు ఎంతసేపు ప్రపంచాన్ని నాకటమే పని. ప్రపంచాన్ని నాకి, నాకి సబ్బు అరిగినట్లు అరిగిపోతున్నాము. మనస్సు బయటకు వెళుతోంది అని కంగారుపడకు. నీ ఇష్టదైవం యొక్క రూపాన్ని ధ్యానించు, ఆయన నామాన్ని స్మరించుకో. అప్పడు నీకు ఏకాగ్రత కలుగుతుంది, పవిత్రుడవు అవుతావు. గురువు దయ, ప్రేమ, జ్ఞానం లేకుండా ఉండడు. ఆయన ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిని పొందింపచేసే వరకు మిమ్ములను తరుముకొంటూ వెళతాడు, వాడు గురువు. చదివేటప్పడు ఇవి అసత్యాలు అని మనకు అనిపిస్తుంది, అనుభవం లోనికి వచ్చినప్పడు అవి ఎంత నిజమో అప్పడు మనకు తెలుస్తుంది. పులి నోటిలో పడ్డ మాంసపు ముక్కను ఎలా తీయలేమో అలాగ గురువు దయలో ఉన్న జీవుడు తరింప బడతాడు కాని అందులోనుండి తప్పకోవటానికి అవకాశం లేదు. వాడు ఏ జన్మలో ఉన్నా, ఏ లోకంలో ఉన్నా తన స్వరూపాన్ని ఇచ్చే వరకు గురువు వాడిని విడిచిపెట్టడు. వాడు స్వర్గానికి వెళ్ళినా, నరకానికి వెళ్ళినా వాడికోసం ఆయన కూడా వెళతాడు, ఆయనకు పని లేకపోయినా వాడికోసం వెళతాడు, వాడు తరించేవరకు వాడిని విడిచిపెట్టడు, వాడు గురువు. భగవంతుడు చెప్పే బోధ ఎందుకు అంటే తను ఏ ఆనందంలో, శాంతిలో ఊగిసలాడుతున్నాడో ఆ స్థితిని జీవుడికి ప్రసాదించటానికి చెపుతున్నాడు.

మనం ఏదిగా ఉన్నామో దాని తాలుక అనుభవం పొందేవరకు మనం జపం చేయాలి, ధ్యానం చేయాలి, మనోనాశనం అయ్యే వరకు ఏదో రకమైన సాధన, ఏదోరకమైన ప్రయత్నం చేస్తూనే ఉండాలి. శాస్త్రం చెప్పిన మాటలపట్ల శ్రద్ధగా ఉండాలి, సత్పురుషులతో సహవాసం చేయాలి. సద్గ్రంథాలను పఠించాలి. మనకు ఎన్ని అవకాశములు ఇచ్చాడో అన్ని అవకాశములు ఉపయోగించుకోవాలి. మన లక్ష్యం ఏదో, మన గమ్యం ఏదో నిర్ణయించుకొని ఆ బాటలో ఎవరైతే ప్రయాణం చేస్తున్నారో వారితో సన్నిహిత అనుబంధం పెంచుకొని తరించాలి. శాస్త్రంలో ఒక మాట చెపుతారు. ఎండ్రిన్ చూస్తే చావము, తలపెట్టుకొన్నా చావము, తాగితే చనిపోతాము. కాని విషయాలను చూసినా, స్మరించినా చాలు మనం పూర్తిగా కుళ్ళిపోయి పాడైపోతాము. విషయచింతన తగ్గించుకో, దైవచింతన పెంచుకో, ఆత్మచింతన పెంచుకో. నీవు ఏది చేసినా, ఏది చూసినా, ఏది తీసుకొన్నా, ఏదైనా ఇచ్చినా ఏదైనా సరే నా దయను పొందటానికి చెయ్యి అంటున్నాడు పరమాత్మ. మనకు రోజూ నిద్రపోవటం తప్పదు, తినటం తప్పదు, తిరగటం తప్పదు, జీవితంలో ఎన్నో పనులు చేస్తున్నాము.

నీవు ఏది చేసినా గమ్యం ఒక్కటే, నా దయను సంపాదించటానికి చెయ్యి. నువ్వు అన్నం తింటే నాకు సేవచేయటానికి అన్నం తిను. నువ్వు స్మరించుకొంటే నన్ను స్మరించుకో, నిద్రపోయినా నా దయ సంపాదించటానికే నిద్రపో, అలాగ అన్ని పనులు నాకోసం చేస్తూ ఉంటే నువ్వు ఏ నేనునయితే తొలగించుకోవాలి అనుకొంటున్నావో ఆ నేను దానంతట అదే కరిగిపోతుంది అని భగవంతుడు చెపుతున్నాడు. మన మనస్సు వాసనారహితం అయింది అనుకోండి, అదే ఆత్మగా మారిపోతుంది. సాకారమైన దేవుడే, నిరాకారమైన దేవుడే. మంచులో ఉన్నది కూడా నీరే, అది గడ్డ కట్టింది కాబట్టి మంచు అంటున్నాము కాని అది కూడా నీరే, ఏ రూపంలో ఉన్నా భగవంతుడే. మనం తపస్సు చేయమంటే ఎలాగు చేయటం లేదు అందుచేత మనకు ఏదో రోగం పెట్టి మనచేత తపస్సు చేయిస్తున్నాడు. మనిషికి రోగం వచ్చింది అంటే ఆ రోగం తపస్సు చేయిస్తుంది. దేవుడికి తెలియకుండా ఆ రోగం రాదు. దేవుడికి తెలియకుండా ఏదీ రాదు. రోగం కూడా మనలను మొట్టికాయలు మొట్టి తపస్సు చేయించటానికే పెడతాడు.

మనకు భగవంతుడిపట్ల నమ్మకం ఉండాలి, ప్రీతి ఉండాలి, లోపల ఇష్టం ఉండాలి. మన మనస్సు ఎప్పుడైనా చలిస్తూ ఉంటే ఆ విషయంలో నుండి నెమ్మదిగా మనస్సును మళ్లించి మన ఇష్టదేవత మీదగాని, చైతన్యంమీద కాని నిలబెట్టి ఉంచాలి, అలాచేయటం వలన మనస్సుకు ఏకాగ్రత రావటమే కాదు, ఆ జీవుడు పవిత్రుడవుతాడు. నీ మనస్సును, ఇంద్రియాలను భగవంతుడి మీదే కేంద్రీకరించు. భగవంతుడి మీద మనస్సును పెట్టి ఆయనను చింతిస్తూ ఉంటే అలా చింతించి, చింతించి మనస్సు నశిస్తుంది, మనస్సు నశిస్తే మనస్సుకు ఆధారంగా ఉన్న చైతన్యం నీకు గోచరిస్తుంది. ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే. దాని స్వరూపం శాంతి, దాని స్వరూపం సుఖం, దాని స్వరూపం ఉండటం. అది లేకపోవటం అంటూ లేదు, అది ఎప్పుడూ ఉంటుంది. మనకు మంచి ఆలోచనలు వచ్చినా మనం ఉంటాము, మనకు చెడుఆలోచనలు వచ్చినా మనం ఉంటాము, శరీరం ఉన్నా మనం ఉంటాము, శరీరం లేకపోయినా మనం ఉంటాము, ఆ ఉండటమే దేవుడు. నిజమైన నేను అది ఉపాధిరహితం, దేహరహితం, లోకరహితం. మీకు ఎప్పుడైనా సంతోషం వచ్చింది అనుకోండి అక్కడ ఆగిపోవద్దు, మీకు ఎప్పుడైనా అనుకున్న పనులు అయిపోతున్నాయి అనుకోండి అక్కడ ఆగిపోవద్దు. ఇవన్నీ నిజం అనుకోవద్దు. అవి ఎలాగ వచ్చాయో అలాగే పోతాయి. దేహమే పోయినప్పుడు అవి ఎంతసేపు నిలబడతాయి. ఏది వచ్చినా దానితో కలవకండి. వస్తే రానివ్వండి, దానిని చూస్తూ ఉండండి. మీకు కష్టం వచ్చినా దానితో కలవకండి, లాభం వచ్చినా దానితో కలవకండి. ప్రారబ్ధాన్ని బట్టి అవి వస్తున్నాయి. ఇవి నిజం

కాదు, ఇవి నిజం కాదు అని వాటితో కలవకండి. అవి మధ్యలో వస్తున్నాయి, మధ్యలోనే పోతాయి. కొంతమంది మాకు రోజులు చాలాబాగా ఉన్నాయి అంటారు. ఏ నేనుకు రోజులు బాగున్నాయి? కొంతమంది రోజులు బాగాలేదు అంటారు. ఏ నేనుకు రోజులు బాగాలేదు? మాకు దుఃఖం వస్తోంది అంటారు, ఏ నేనుకు దుఃఖం వస్తోంది? కొంతమంది బెంగ పెట్టుకొంటారు. నేను ఉంటే బెంగ ఉందా? నేను లేకపోతే బెంగ ఉందా? ఏ నేనుకు ఆ బెంగ వస్తోంది? ఆ నేను ఎవరు? అదే మిథ్యానేను, అదే దేహగతమైన నేను. ఈ నేనుకే అదృష్టం, దురదృష్టం, సుఖం, దుఃఖం, లాభం, నష్టం అన్నీ దానికే. ఆ దేహగతమైన నేనును తీసేస్తే అదృష్టం లేదు, దురదృష్టం లేదు, లాభం లేదు, నష్టం లేదు, ఏమీ లేదు. ఉన్నది ఒక్కటే కాని ఇన్ని బేధాలు కల్పించేది ఈ దేహగతమైననేనే. అందులో నుండి విడుదలపొందితే ఏమీ లేదు. జీవుడు అస్వతంత్రుడు, దేవుడు స్వతంత్రుడు. మనకు స్వతంత్రం లేదు కాబట్టే భయం, అసూయ, కోపం ఇవిఅన్నీ వస్తున్నాయి. జీవుడు వాడికి ఉన్న జీవలక్షణాలను పోగొట్టుకొంటే వాడే దేవుడు. మీరు ఏదైతే కాదో దాని మీద మీ మనస్సును పెట్టకండి. ఎందుచేతనంటే మీరు కానిదానిమీద, మీ మనస్సును పెట్టినా అది మీరు అవ్వరు. మీరు ఏది అవునో దానిమీద మీ మనస్సును పెట్టండి, అప్పుడు మీకు అక్కరలేని తలంపులు, ఆలోచనలు, మిమ్మల్ని ఇబ్బంది పెట్టే విషయాలు వాటంతట అవే రాలిపోతాయి. అన్ని తలంపులకు మూలం దేహం నేను అనే తలంపు. ఈ మూలతలంపు ఎక్కడ నుండి వస్తోందో గమనించు. అది ఎక్కడ నుండి వస్తోందో నీవు చూడగలిగితే అది నశిస్తుంది. అది నశిస్తే నీవు నశించవు ఎందుచేతనంటే అది నీవు కాదు కాబట్టి.

ఉపనిషత్‌లు చెప్పినా, బుద్ధుడు చెప్పినా, ఏసు చెప్పినా ఆ భావాలు వేరుగా ఉండవచ్చు, సాంప్రదాయాలలో బేధం ఉండవచ్చు కాని అంతర్లీనంగా ఉన్న సత్యం ఒక్కటే. అది ఎక్కడో ఉంది అని అనుకోవద్దు, మూలతలంపు మూలంలోనే సత్యం ఉంది. మూల తలంపు దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది, అప్పుడు అక్కడ ఉన్న సత్యం నీకు గోచరిస్తుంది. అప్పుడు నీకు నిజమైన స్వేచ్ఛ కలుగుతుంది, పునర్జన్మలేనిస్థితిని పొందుతావు, అప్పుడు నీ శరీరం కనిపించినా కనిపించకపోయినా, లోకం కనిపించినా కనిపించక పోయినా శాంతిలో, ఆనందంలో ఊగిసలాడతావు. నువ్వు ప్రాణాన్ని నిరోధించి, ఇంద్రియాలను నిగ్రహించి, మనస్సును నిరోధించి, పరిసరాలను జయించి, అనుకరణ విడిచిపెట్టి, ఆత్మ విశ్వాసాన్ని పెంచుకొని, మనం దానిని సాధించైనా సాధించాలి లేకపోతే ఆ ప్రయత్నంలో మరణించాలి అనేటువంటి త్రికరణశుద్ధిగా, ఏకాగ్రతతోటి నువ్వు పనిచేస్తూ ఉంటే, నీ మనస్సును ఉపసంహరిస్తూ పోతే మనస్సు దాని మూలాన్ని చూసిన వెంటనే అది నశిస్తుంది,

అక్కడ ఉన్న సత్యం నీకు గోచరిస్తుంది. నిజమైన సుఖం నీకు కావాలా? స్వతంత్రమైన సుఖం నీకు కావాలా? పునర్జన్మలేనిస్థితి నీకు కావాలా? ఇవన్నీ నీకు నిజంగా కావాలి అని అనుకొంటే నీ హృదయంలో ఉన్న సత్యవస్తువుతో తాదాత్మ్యం పొందకుండా, అది నీకు అనుభవంలోనికి రాకుండా నీవు అజ్ఞానంలో నుండి, అవిద్యలోనుండి బయటకు రాలేవు, స్వతంత్రమైన సుఖం నీకు దొరకదు. నీకు ఏ కారణం వలన అశాంతి వచ్చినా, వేదన వచ్చినా లోపల అజ్ఞానం ఉంది. ఆ అజ్ఞానం మూలతలంపు రూపంలో ఉంది. ఆ మూల తలంపు నశించకుండా అజ్ఞానం నశించదు. ఆ మూలతలంపు నశిస్తే నీవు అంధకారంలో నుండి బయటపడతావు, వెలుగులో ప్రవేశిస్తావు. మీరు నిజంగా భగవంతుడిని ప్రేమిస్తూ ఉంటే, మీ సాధన నిజమైతే మనస్సుకు నిర్మలత్వం, నిశ్చలత్వం వస్తుంది, హృదయం విశాల మవుతుంది. గీతలో ఒక్క శ్లోకం చదివి, అర్థం చేసుకొని, దానిని మనస్సులో ఇముడ్చుకొన్నా పవిత్రులవుతాము, మనం తరిస్తాము.

మీకు వాసనల యొక్క వేగం ఎక్కువగా ఉన్నప్పుడు తరించమేమో అని అనిపిస్తుంది, మీరు భయపడవద్దు, వాసనల యొక్క వేగం ఎక్కువగా ఉన్నా అవి మీరు కాదు. తలంపులు ఎక్కువగా వస్తూ ఉన్నా అవి మీరు కాదు. భగవంతుడిని స్మరిస్తూ ఉంటే, ఆయనను ధ్యానిస్తూ ఉంటే ఆయన దయవలన తలంపులు పల్చబడి, మీకు తెలియకుండా అవి రాలిపోతాయి. మనం 5 పైసలు కృషిచేస్తే, భగవంతుడి దగ్గర నుండి 95 పైసలు దయ వస్తుంది. దేవుడు ఎప్పుడు, ఎక్కడ, ఎలా సహాయసహకారములు అందించాలో ఆయన చూసుకొంటాడు. కాని మన చేతిలో ఉన్న పనిని శ్రద్ధగా, ప్రేమగా, భక్తిగా చేయాలి. మీకు అవసరంలేని విషయాలను, పనులను మొఖానికి రాసుకోవద్దు. మనం చేస్తున్నపని మనలో ఉన్న అజ్ఞానాన్ని తగ్గించాలి, వ్యక్తిభావనను తగ్గించాలి. మనం ఎప్పుడైతే రూపరహితస్థితి, నామరహితస్థితి పొందామో నది వెళ్ళి సముద్రంలో కలిసినట్లుగా అప్పుడు మనం పరమాత్మలో ఐక్యమవుతాము. నారాయణ అనే నాలుగు అక్షరాలు ధర్మ, అర్థ, కామ, మోక్షం అనే నాలుగు పనులు చేసిపెడతాయి. ధర్మాన్ని అంటిపెట్టుకొని నడిపిస్తుంది, మనకు కావలసిన పైసాలు ఇస్తుంది, న్యాయపరమైన కోరికలు నెరవేస్తుంది, మోక్షాన్ని కూడా ఇస్తుంది, అదే నారాయణ నామం. నామంలో ఏముంది అని మీరు అనుకోవద్దు. విత్తనం చాలా చిన్నదిగా ఉంటుంది కాని అందులోనుండి మహావృక్షం వస్తుంది. దేవుడి నామాన్ని జాగ్రత్తగా పోషించుకొంటే జ్ఞానం అనే వృక్షం మనలో వికసిస్తుంది, అది మహావృక్షం అవుతుంది. అప్పుడు నీవు ఇతరుల నీడలో ఉండనక్కరలేదు, మీరే ఇతరులకు నీడనిస్తారు, అట్టిది నామం యొక్క మహిమ. నామం మీకు చిన్న పేరు కింద కనిపిస్తుంది కాని ఆ నామమే మీకు జ్ఞానాన్ని తెచ్చిపెడుతుంది.

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



# సద్గురు శ్రీ నాన్నగారి 72వ జన్మదిన మహోత్సవము

ఉదయం గం॥ **6-00**ల నుండి

## సద్గురు దర్శనం

ఉ॥ గం॥ **8-00**లకు

## భగవాన్ పూజ – శ్రీరమణ క్షేత్రంలో

ఉ॥ గం॥ **10-00**ల నుండి మ॥ గం॥ **12-00**ల వరకు

## దూరప్రాంత భక్తులకు ప్రసాద వినియోగం

మ॥ గం॥ **12-00**లకు

## శ్రీ నాన్నగారు రమణ క్షేత్రమునకు విచ్చేయుదురు

మ॥ గం॥ **2-00**లకు

## సద్గురువుకు కమిటీవారిచే సన్మానం

మ॥ గం॥ **2-15** ని॥లకు

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు

# మాయా స్వరూపం

ఒక్కడేయైన పరమాత్మ మాయతో సంబంధము కలుగుటచే అనేకములుగా భాసించుచున్నాడు. కారణాత్ముడైన పరమేశ్వరుడు కార్యాత్ముడైన జీవుని ప్రేరేపించును మరియు నియోగించును. వాస్తవమునకు పరమాత్మ ఈ సృష్టిని చేయడు. ఇదంతా మాయాకార్యమే. అజ్ఞానియగు శిష్యునకు క్రమక్రమముగా అర్థమగుటకు జీవాత్మను పరమాత్మ ప్రేరేపించును, నియోగించునని, వ్యవహార దృష్టిని అనుసరించి గురువు బోధిస్తాడు. ప్రకృతి, మాయా, అవిద్య, అజ్ఞానము అన్నీ ఒక్కటే. ఈ మాయ ఎప్పుడు వచ్చిందో, ఎలా ఏ విధంగా జీవుని వరించిందో చెప్పటానికి సాధ్యము కాదు. అందుచేతనే జీవుడు, మాయా రెండు అనాదులే అని పెద్దలంటారు.

ఈశ్వరుడు నిత్యుడు. ఈశ్వరుడిని అంటిపెట్టుకొని యున్న మాయ అనాది. ఎప్పుడో ఒకప్పుడు, ఎలాగో ఒకలాగున అది జీవుని ఆవరించింది. మాయ అంటే అజ్ఞానమే. అది ఎట్లా వచ్చింది అని విచారించినందువలన ప్రయోజనము లేదు. దానిని ఎలా పోగొట్టుకోవాలి అని ప్రయత్నించాలి. జ్ఞానము సంపాదించినచో అజ్ఞానము పటాపంచలగును. 'ఏకమేవా ద్వితీయం బ్రహ్మ' అని శ్రుతి చెప్పినది కాబట్టి, జీవాత్మ పరమాత్మ కంటే వేరు కాదు. ఈ సృష్టి, స్థితి, లయములకు మాయా కార్యములే కారణము. ఆత్మ కేవలం సాక్షి మాత్రమే. ఆత్మ యొక్క సత్తా స్ఫూర్తులే మాయా వ్యవహారములకు కారణము కనుక ప్రేరేపించువాడు, ప్రేరేపించబడువాడు అని ఇద్దరు లేరు. ఉన్నది ఒక్కటే.

**- బొప్పన అరుణాదేవి, హైదరాబాద్**